వార్త - 26.02.08

# ఫిర్యాదులు 'ప్రజావాణి' ఆన్‌లైన్‌లో : కలెక్టర్

అనంతపురం టౌన్,
ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫిర్యాదులు దినోత్సవంలో వచ్చిన ఫిర్యాదులను 'ప్రజావాణి'లో ఆన్‌లైన్‌లో వుంచుతున్నట్లు కలెక్టర్ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. సోమవారం స్థానిక రెవెన్యూభవన్‌లో కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ తీసుకుంటున్న ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ వాటిని ఆన్‌లైన్‌లో వుంచుతున్నామన్నారు. ఫిర్యాదులపై విచారించి ఫిర్యాదుదారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టరేట్‌కు పంపించాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదులపై అధికాగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ప్రతి సోమవారం ఇంత రద్దీ వుండదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు 1148 అర్జీలను స్వీకరించగా వీటిలో 645 పరిష్కరించామని, 503 అర్జీలను పరిష్కరించాల్సి వుందన్నారు.

రుణాల మంజూరు, ఇందిరమ్మ గృహాలు, ఫించన్లు వంటి ఆర్థికపరమైన అర్జీలను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలన్నారు. పై అధికారులు ప్రతిపాదించిన ఫిర్యాదులు, విచారణ నిర్వహించాల్సిన అర్జీల గురించి సత్వరమే చర్యలు తీసుకొని పూర్తి నివేదికలు ప్రజావాణిలో వుంచాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన బత్తలపల్లి టీచర్స్ కాలనీకి చెందిన కె.శ్రీహరి, ఆ కాలనీ వాసులు రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ వుందని, విద్యుత్ తీగలు ఆరేడడుగుల ఎత్తులో వున్నాయని, దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.


రెవెన్యూ భవన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీదర్,జెసి చిరంజీవులు

గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన అశ్వర్థమ్మ 7వ నంబర్ జాతీయ రహదారికి సంబంధించి మా భూమిని ఇచ్చామని, దీనికి నష్ట పరిహారం ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిరంజీవులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.